క్లుప్తంగా

ఘనంగా సంక్రాంతి సంబరాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కృష్ణకుమార్

పెందుర్తి: నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. సిబ్బందికి క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. భోగి మంటలు వేసి సందడి చేశారు. జీఎం రాధాకృష్ణన్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ నస్రీన్, డాక్టర్ శిరీష, డాక్టర్ కృష్ణ, డాక్టర్ చల్లా, డీజీఎం బంగార్రాజు, వేణుగోపాల్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీనృసింహ దీక్షల విరమణ

సింహాచలం: అడవివరానికి చెందిన సింహాద్రి మఠం ఆధ్వర్యంలో శ్రీనృసింహ దీక్షల విరమణ శనివారం శాస్త్రోక్తంగా జరిగింది. 41 రోజుల మండల దీక్ష, 32 రోజుల దీక్ష పూర్తి చేసిన వారు సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో దీక్షలు విరమించారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిదీక్షాదారులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఘాట్ రోడ్డు, మెట్లమార్గంలో తిరుముడులతో సింహగిరికి చేరుకున్నారు. నృసింహ నామస్మరణ చేస్తూ స్వామిని దర్శించుకున్నారు.

సీఐ బాలసూర్యారావు బాధ్యతల స్వీకరణ



పరవాడ: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.బాలసూర్యారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐ పి.ఈశ్వరరావు కాశీబుగ్గ సర్కిల్‌కు బదిలీపై వెళ్లారు. పరవాడ సీఐగా బాధ్యతలు చేపట్టిన బాలసూర్యారావు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకొంటామని చెప్పారు. సంక్రాంతి పండగను సంప్రదాయ బద్ధంగా నిర్వహించుకోవాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో కోడి పందాలు, జూదాలు, లాటరీ బల్లలు వంటివి నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రహదారి నియమావళిపై అవగాహన అవసరం



సదస్సులో ప్రసంగిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: రహదారి భద్రత పట్ల అన్ని వర్గాల ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ అన్నారు. రాంకీ కమర్షియల్ హబ్‌లో రహదారి భద్రతపై కార్మికులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. వాహనాలు నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించడం అలవర్చుకోవాలన్నారు. వాహనదారులు సెల్ ఫోన్ మాట్లాడూ డ్రైవింగ్ చేయడం మానుకోవాలని సూచించారు. రహదారి నియమావళి పాటించి ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని డీఎస్పీ సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ ఎస్.బాల సూర్యారావు, రాంకీ ప్రతినిధి మాధవరావు, సేఫ్టీ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన దుర్గాప్రసాద్

కొత్తవలస: కొత్తవలస-పెందుర్తి రైల్వే లైన్‌లో మంగళపాలెం గ్రామ సమీపంలో రైలు కింద పడి తాటిచెట్లపాలెం సమీపంలోని సంజీవయ్య కాలనీకి చెందిన పిట్టా దుర్గాప్రసాద్ (47) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కొద్ది కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్టు తెలిసింది. మంగళపాలెంలో తెలిసిన వారి ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఏడీరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలను సేకరించారు. మృతదేహాన్ని విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.



సంక్రాంతి ముగ్గు



పెందుర్తిలో పండగ సంత సందడి

సంక్రాంతి సందడి

- పల్లెలు కళకళ,
- వస్త్రదుకాణాలు కిటకిట

పెందుర్తి: కొత్త దుస్తులు..రకరకాల పిండివంటలు.. బంధుమిత్రుల ముచ్చట్లు..కొత్త అల్లుళ్లకు మర్యాదలు..పిల్లాపాపల ఆటపాటలు అన్ని కలబోసుకుని సరదాల సంక్రాంతి వచ్చేసింది. ధనుర్మాసం నెల రోజులూ పల్లె వాకిళ్లలో రంగవల్లుల పలకరింత.. మంచు పొరల తెరలు తొలగుతున్న వేళ హరిదాసుల నారాయణ కీర్తన సడి..అమ్మగారికి అయ్యగారికి దణ్ణం పెడుతూ డూడూ బసవన్నల కాలి అందెల సవ్వడి..కోడి పందాలతో పందెం రాయుళ్ల హడావుడి..కలగలిసి అచ్చతెనుగు అందాల పండగ సంక్రాంతి. ఆదివారం భోగి మంటలతో ప్రారంభమయ్యే సంక్రాంతి సంబరాలు ముక్కనుమ వరకు జరుగుతాయి. భోగి రోజు దేవుడికి పప్పు అన్నం, సంక్రాంతినాడు పెద్దలకు కలగూర నైవేద్యం, కనుమ రోజు గోమాతలకు పుల్లట్లు సమర్పించడం ఆనవాయితీ.

ఆహా ఏమి రుచి

పండగ మూడు రోజులూ నోరూరించే పిండివంటలు, షడ్రుచుల విందు భోజనం జిహ్వా చాపాల్యాన్ని సంతృప్తి పరుస్తాయి. పండగకు అరిసెలు, మినప సున్నుండలు, జంతికలు, పొంగడాలు, బూరెలు ప్రత్యేక ఆకర్షణ. కొత్త ధాన్యం, బెల్లం, ఇళ్లకు చేరడంతో ఆయా పిండివంటలు తప్పక ఉంటాయి. ఇంట్లో మహిళలు వేడి వేడి జంతికలు వేస్తుంటే దొంగచాటున పిల్లలు, పెద్దలు తినేయడం సరదాగా ఉంటుంది. సున్నుండలను బావలకు తినిపించేందుకు మరదళ్లు పడే ఆరాటం చూడముచ్చటగా ఉంటుంది. ఇక కనుమనాడు కొత్త అల్లుళ్ళకు అన్నిరకాల మాంసాహార వంటకాలు వండి కొసరికొసరి వడ్డించడం ముచ్చటగా ఉంటుంది.

సమరానికి సిద్ధం

సంక్రాంతి సంబరాల్లో కోడిపందాలు, చతుర్ముఖపారాయణం జోరుగా సాగుతాయి. పండగ మూడు రోజులతో పాటు తర్వాత వచ్చే అమ్మవార్ల తీర్థాల్లో వీటి జోరు ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే పందెరాయుళ్లు కోళ్లను సిద్ధం చేశారు. కోళ్లతో పాటు ఆయా ప్రాంతాల ఆర్థిక స్థితిని బట్టి రూ.వేల నుంచి లక్షల్లో పందాలు కాస్తారు. కొన్నిచోట్ల భూములు, ఆస్తులకు కూడా పోటీలు జరుగుతుంటాయి. అయితే పోలీసులు ఈ ఏడాది పందాలపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించడంతో పందెం రాయుళ్లకు గండమే.!

దుకాణాలు రద్దీ

పండగ సందర్భంగా దుకాణాలన్నీ సందడిగా మారాయి. నూతన వస్త్రాల కొనుగోళ్లతో వస్త్రదుకాణాలు రద్దీగా ఉన్నాయి. పలుచోట్ల పండగ సంతలు నిర్వహించారు. పెందుర్తి, పరవాడ, సబ్బవరం ప్రాంతాల్లో రూ. కోట్లలో వ్యాపారం జరిగింది. చాలా ప్రాంతాల్లో భోగిరోజు ఆదివారం ఉదయం కూడా కొనుగోళ్లు జరుగుతాయి. మరోవైపు సంక్రాంతి సంబరాలు ఆరంభంతో వాకిళ్లలో రంగవల్లులు ఆకట్టుకున్నాయి. పెందుర్తి ప్రాంతంలో పలుచోట్ల మహిళలు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచి పండగ వర్ణాలు అద్దారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



వాడచీపురుపల్లిలో ..



నాయుడుపాలెంలో పల్లకి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పరవాడ: ధనుర్మాసంలో భాగంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో మేలుకొలుపును భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మండలంలోని పరవాడ, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, లంకెలపాలెం, బొడ్డపువానిపాలెం, వెన్నలపాలెం, తానాం, రావాడ, ధర్మాయుడుపేట, కలపాక గ్రామాల్లో రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల కేంద్రంగా శనివారం మేలుకొలుపు కార్యక్రమాలను భక్తులు వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ధార్మిక జట్లు వేకువ జాము నుంచి భగవంతుడిని వీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దేవాలయాల కేంద్రంగా ప్రతీ పౌర్ణమి రోజు సామూహిక హారతి, వారం వారం భజన, ఏకాదశి రోజున నగర సంకీర్తన, నెలలో ఒక రోజు సత్సంగం నిర్వహించాలని ఫౌండేషన్ ప్రతినిధులు సూచించారు. కార్యక్రమాల్లో మాతృమూర్తులు, గ్రామ పూజారులు, భజన గురువులు, గురుస్వాములు, పెద్దలు, ఆలయ ధర్మకర్తలు, యువత పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



బాడీ డౌన్ లాడర్ స్కోలింగ్, టైర్ క్రాలింగ్ ప్రక్రియలపై విద్యార్థులకు శిక్షణ

పెదగంట్యాడ: జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవడంతో పాటు అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలనే అంశాలపై హిందుస్థాన్ సౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు శనివారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన 30మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఫైర్ ఫైటింగ్, బాడీ డౌన్ లాడర్ స్కోలింగ్, టైర్ క్రౌలింగ్ ప్రక్రియలపై శిక్షణ ఇచ్చారు. ప్రతికూల పరిస్థితుల్లో, ఆపదలు, విపత్తులు సంభవించినపుడు ఇతరులకు ఎలా సాయం అందించాలనే అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో టెంట్లు వేయించడం, అప్పటికప్పుడు ఆహార పదార్థాలను తయారు చేయడం తదితర అంశాలను వివరించారు. స్కౌట్ మాస్టార్ ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే 'ఇంటక్' ప్రధాన ఎజెండా



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇంటక్ జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్

అక్కిరెడ్డిపాలెం: కార్మికుల సంక్షేమమే ప్రధాన ఎజెండా అని ఇంటక్ జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ అన్నారు. ఆటోనగర్‌లోని ఏపీఎస్ఈబీ కో ఆపరేటివ్ సొసైటీ బిల్డింగ్‌లో శనివారం నిర్వహించిన జిల్లా ఇంటక్ అత్యవసర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విశాఖ భవిష్యత్తుకు ప్రమాదకరం అన్నారు. కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలన్నారు. అనంతరం ఇంటక్ నూతన క్యాలెండర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో భెల్ (హెచ్‌పీవీపీ) ఇంటక్ నాయకుడు ఉరుకూటి బాబూరావు, డాక్‌యార్డు నుంచి బి.చిన్నారావు రెడ్డి, ఎం.కె.కొండబాబు, హెచ్‌పీసీఎల్ నుంచి నర్సింగరావు, షిప్‌యార్డు నుంచి శ్రీరామ్మూర్తి, ఎంఈఎస్ నుంచి షేక్ బాబ్జీ, స్టీల్‌ప్లాంట్ నుంచి నీరుకొండ రామచంద్రరావు, బీఎస్ రాజు, పి.వి.నగేష్, పి.వి.రమణమూర్తి, గంగవరం గోపీ, ఎన్టీపీసీ నుంచి బీమారావు, లెనిన్ పాల్గొన్నారు.

తండ్రి అస్థికలు కలిపి వస్తూ అనంత లోకాలకు..

- తాళ్లపాలెం వద్ద రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
- నలుగురికి తీవ్రగాయాలు



మృతుడు భాస్కరరావు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద కారు బోల్తా పడి ఒకరు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గోదావరి నదిలో అస్థికలు కలిపి తిరిగి ఇంటికి వస్తుండగా శనివారం ప్రమాదం జరిగింది. సీఐ ఆనందబాబు అందించిన వివరాల ప్రకారం.. పరవాడ మండలం అగనంపూడికి చెందిన ఈతపల్లి నారాయణరావు ఇటీవల మృతి చెందారు. దీంతో సంప్రదాయంగా ఆయన అస్థికలు గోదావరిలో కలపడానికి ఆయన కుమారులు ఈతపల్లి భాస్కరరావు(28), వాసుదేవరావు బంధువులతో కలిసి రాజమహేంద్రవరం వెళ్లారు. అక్కడ గోదావరి నదిలో అస్థికలు కలిపిన అనంతరం కారులో అగనంపూడి ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారి వంతెన సమీపంలోకి వచ్చేసరికి రోడ్డు పక్కన రక్షణగా వేసిన రెయిలింగ్ స్తంభాన్ని ఢీకొట్టి పక్కనున్న పొలాల వైపు బోల్తా పడి పల్టీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న భాస్కరరావు(28), వాసుదేవరావు, బంధువులు ఈతపల్లి గణేష్, మురళీగణేష్, రెడ్డిబోయిన వెంకటరావు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జాతీయ రహదారి వాహనంలో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భాస్కరరావు మృతి చెందారు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. మృతుడు భాస్కరరావు పరవాడ ఫార్మాసిటీలోని ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. అతని మృతితో కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

కొనసాగుతున్న ధారోత్సవాలు



అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై మూడోరోజు శనివారం ధారోత్సవాలను విశేషంగా నిర్వహించారు. ఉదయం గోదాదేవి అమ్మవారు, చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకీలో తిరువీధిగా ఆలయ ఈశాన్య దిక్కులో ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అమ్మవార్లకు గంగధార జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి గంగధార వద్ద మండపంలో అధిష్ఠింపజేసి పాశుర విన్నప పారాయణ చేశారు. అర్చకులు కుమారాచార్యులు, శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో చలపతి మృతదేహం

పెందుర్తి: మండలంలోని రాంపురం వద్ద అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై లారీ ఢీ కొనడంతో ఒక వ్యక్తి మృతిచెందాడు.స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని రాంపురానికి చెందిన అన్నంరెడ్డి చలపతి(42) శనివారం ఉదయం 7 గంటల సమయంలో పశువులను మేతకు తోలుకొని జాతీయ రహదారి అవతలకు వెళ్లాడు. మరలా టీ తాగేందుకు జాతీయ రహదారి ఇవతలకు వస్తున్న సమయంలో జాతీయ రహదారిపై సబ్బవరం వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది.దీంతో చలపతి అక్కడికక్కడే మృతి చెందాడు. పెందుర్తి ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్న ఆలయంలో ఉత్సవాలు భేష్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న స్వామీజీలు

పెందుర్తి: సింహాద్రి అప్పన్న ఆలయంలో ఉత్సవాల నిర్వహణ ప్రశంసనీయంగా ఉందని విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ అన్నారు. సింహచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో రూపొందిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ శనివారం ఆవిష్కరించారు. స్వామీజీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో భక్తులకు మరిన్ని సదుపాయాలు కల్పించే దిశగా కృషి చేయాలని సూచించారు.

'సంప్రదాయాలను కాపాడుకుందాం'

ఏయూక్యాంపస్: ఆధునికతను స్వాగతిస్తూనే.. మన సంప్రదాయాలను కాపాడుకుందామని సినీనటుడు పూడిపెద్ది సాయికుమార్ పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న మహా సంక్రాంతి సంబరాల్లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు, రచయితలు, కళాకారులను అందించిన విశాఖ నగరం సాంస్కృతిక రాయబారిగా నిలుస్తుందన్నారు. 'నా తండ్రిది విజయనగరం జిల్లా కళ్లేపల్లి అగ్రహారం. నేను శ్రీకాకుళం జిల్లా అల్లుడినే..' అని చెబుతూ ఉత్తరాంధ్రతో తనకు ఉన్న అనుబంధాన్ని వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలను భవిష్యత్ తరానికి అందించే బాధ్యతను జీవీఎల్ బృందం ఎంతో సమన్వయంతో నిర్వహించిందన్నారు.

తొలి షీల్డ్ విశాఖలోనే అందుకున్నాను

నేను నటించిన తొలి చిత్రం ఛాలెంజ్ విశాఖలో చిత్రీకరించారని.. చిరంజీవితో కలిసి ఈ చిత్రంలో నటించిన సందర్భాన్ని సాయికుమార్ గుర్తు చేసుకున్నారు. జీవీఎల్ మాట్లాడుతూ ఘంటసాల పాట, గోంగూర పచ్చడి తెలుగు వారికి ఎంత ఇష్టమో.. సాయికుమార్ స్వరం కూడా అంతే ఇష్టమన్నారు. ఆదివారం ఉదయం 4 గంటల నుంచి ఇదే ప్రాంగణంలో భోగి మంటలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి చిన్నారులకు భోగిపళ్లు పోసే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఇక్కడ చేసిన ఏర్పాట్లు ఆకట్టుకున్నాయి

యాదవుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



పురుషోత్తపురంలో యాదవ సంక్షేమ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: ప్రభుత్వం యాదవుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 94వ వార్డు పురుషోత్తపురంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.15.46 లక్షలతో నిర్మించిన యాదవ సంక్షేమ సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సామాజిక న్యాయం ద్వారా అన్నివర్గాలకు చేయూతనందిస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆదిరెడ్డి మురళి, నాయకులు కోరాడ చందుయాదవ్, ఆబోతు వెంకటరమణ, ఎలమంచిలి శ్రీను, ఆబోతు శ్రీను, వారాది పద్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

టీడీపీ కార్పొరేటర్ రగడ:

యాదవ సామాజిక భవన ప్రారంభోత్సవంలో టీడీపీ కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు అవసర వివాదాన్ని రేపారు. జీవీఎంసీ నిధులతో నిర్మించిన భవనానికి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రొటోకాల్ పాటించలేదంటూ రెచ్చిపోయారు. తన అనుచరులతో కలిసి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నం చేశారు. అయితే ఈ భవనాన్ని గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించామని టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేతలు వివరించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇది చూసిన పురుషోత్తపురం వాసులు టీడీపీ కార్పొరేటర్ పాటు ఆ పార్టీ నాయకుల తీరుపై దుమ్మెత్తిపోశారు. టీడీపీ నాయకులకు ప్రతీదీ రాజకీయమే అంటూ మహిళలు చీధరించుకున్నారు.

వెంకటాద్రి.. ఆధ్యాత్మిక ఝరి

- విశేషంగా ధనుర్మాసపూజలు
- పోటెత్తిన భక్త జనం



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి



తిరువీధిలో స్వామి



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రి భక్తజన సందోహంగా మారింది. ధనుర్మాసంతో కూడిన శనివారంతో పాటు శ్రవణా నక్షత్రం కావడంతో భక్తులు వేకవ జాము నుంచే పోటెత్తారు. వెంకన్న స్వామిని దర్శించుకుని తరించారు. వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవ పూజలు తుది దశకు చేరుకున్నాయి. శనివారం స్వామివారికి విశేష పూజలు జరిపారు. తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారు, అమ్మవార్ల తిరువీధి మహోత్సవాన్ని పెందుర్తి కూడలి నుంచి వెంకటాద్రి వరకు భారీ ఎత్తున నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులు గోదాదేవి అమ్మవారికి సారె సమర్పించారు. ఆదివారం భోగి పర్వదినం సందర్భంగా గోదా రంగనాయకుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఈవో నీలిమ తెలిపారు.

వెంకన్న ఆలయంలో ...

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాస పూజలు విశేషంగా జరిగాయి. గోదాదేవి అమ్మవారిని విశేషంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. తిరుప్పావై సేవాకాలం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని, వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు భార్గవ్ తదితరులు పూజలు నిర్వహించారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ దంపతులు



ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావుకు అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు.ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపిక,ప్రసాదాన్ని ఈవో శ్రీనివాసమూర్తి వారికి అందజేశారు.

దేశ అభ్యున్నతికి మోదీ కృషి

సబ్బవరం: దేశ అభ్యున్నతికి ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రామునాయుడు అన్నారు. మండలంలోని అసకపల్లి, గొల్లలపాలెం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను శనివారం నిర్వహించారు. అసకపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ యాత్రలో 1 8శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇళ్లు, ఆహార భద్రత, స్వచ్ఛభారత్ మిషన్, రైతుకు చేయూత, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధికల్పన, జాతీయ రహదారుల అభివృద్ధి,ముద్రయోజన, వైద్య ఆరోగ్య రంగం, అసంఘటిత కార్మిక రంగానికి అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. వివిధ సంక్షేమ పథకాలను వివరించారు.వాటిని సద్వినియోగం చేసుకోవాలనికోరారు. గ్రామ సర్పంచ్ కర్రి నర్సింగరావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ కర్రి అప్పారావు, మండల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్. బాబూరావు, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు వనం సత్యనారాయణ, కో-కన్వీనర్ రెడ్డి రామునాయుడు పాల్గొన్నారు.